

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 07-06-2025 | సంపుటి - 24 | సంచిక - 36 | రూ : 4 | పేజీలు: 8

### జమ్మూకశ్మీర్ అభివృద్ధికి
## ఆటంకం రానీయను

- ప్రధాని నరేంద్ర మోదీ హామీ

**జూన్ 6, కట్రా:** జమ్మూకశ్మీర్ భారతావనికి మకుటం లాంటిదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణించారు. ఇక్కడి ప్రజలకు తన పూర్తి మద్దతు అందిస్తామని అభయమిచ్చారు. పహల్గాం ఉగ్రదాడి జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి పనులకు ఆటంకంగా మారనీయబోనని ఆయన శుక్రవారం ప్రతినపూనారు. ''ఆపరేషన్ సిందూర్'' కొనసాగిన రోజుల్లో పాకిస్థాన్ ప్రయోగించిన శతఘ్ని గుండ్లకు ధైర్యంగా ఎదురొడ్డిన సరిహద్దు ప్రాంత వాసులను తరువాయి 2లో



### అలరిస్తున్న..
## మసులా బీచ్ ఫెస్ట్

- వేలాదిగా తరలివస్తున్న పర్యాటకులు
- జెట్‌స్కీ, హెలిరైడ్‌లకు ఆసక్తి చూపుతున్న ప్రజలు



**జూన్ 6, మచిలీపట్నం:** రాష్ట్రంలోనే తొలిసారిగా 3వ జాతీయ సీకయాకింగ్ పోటీలు మచిలీపట్నం మంగినపూడి తీరంలో జరుగుతున్నాయి. కయాకింగ్, స్టాండప్ పెడలింగ్ ఛాంపియన్‌షిప్2025ను మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాలను తలపించేలా వాటర్ స్పోర్ట్స్ కేంద్రంగా మంగినపూడి బీచ్‌ను తరువాయి 2లో

### రాజ్యసభకు
## కమల్‌హాసన్ నామినేషన్

- సీఎం స్టాలిన్ హాజరు

చెన్నై : మక్కల్ నీది మయ్యం(ఎంఎన్‌ఎం) పార్టీ అధినేత, నటుడు కమల్‌హాసన్ శుక్రవారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. చెన్నై సెక్రటేరియట్‌లో ఎన్నికల అధికారి శివసుబ్రమణియానికి నామినేషన్ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు నేతలు హాజరయ్యారు. కమల్‌హాసన్‌తో పాటు ఎస్ఆర్ శివలింగం, కవయిత్రి సల్మా, ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న న్యాయవాది విల్సన్ సైతం డీఎంకే తరఫున నామినేషన్లు వేశారు. మరో ఇద్దరు అన్నాడీఎంకే నేతలు కూడా నామపత్రాలు సమర్పించారు. రాష్ట్రానికి సంబంధించి ప్రస్తుతం ఖాళీ అవుతున్న ఆరు స్థానాలకుగాను 4 స్థానాల్లో పోటీచేయనున్నట్లు ఇప్పటికే డీఎంకే వెల్లడించింది. అందులో ఒక స్థానాన్ని మిత్రపక్షమైన ఎంఎన్‌ఎంకు కేటాయించింది.



### రోజూ ప్రయాణించేది
## 6.50 లక్షల మంది!



- మెట్రోరైలు రెండోదశ(బి)లోని 3 మార్గాల్లో 2030 నాటికి అంచనాలివి
- డీపీఆర్‌లకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం
- కేంద్రం అనుమతి కోసం పంపేందుకు ఏర్పాట్లు

**జూన్ 6, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న... మెట్రో విస్తరణకు మరో అడుగు పడింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) మూడు మార్గాల డీపీఆర్‌లను వేర్వేరుగా రూపొందించగా తాజాగా వాటికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వెంటనే కేంద్రానికి పంపాలని అధికారులను ఆదేశించింది. మెట్రో రెండోదశ బీభాగంలోని మూడు మార్గాలు కలిపి 86.1 కి.మీ. పొడవున 2030 నాటికి పూర్తయితే ప్రతిరోజూ 6.50 లక్షల తరువాయి 2లో



## మరో ఎన్‌కౌంటర్

- తెలంగాణకు చెందిన మావోయిస్టు పార్టీ సభ్యుడు భాస్కర్ మృతి
- నేషనల్ పార్కు అభయారణ్యంలో వరుస ఘటనలు

**జూన్ 6, ఆదిలాబాద్ :** వరుస ఎదురుదెబ్బలతో మావోయిస్టు పార్టీ కుప్పకూలుతోంది. ఒక్కొక్కరుగా కీలక నేతలు నేలకొరుగుతున్నారు. గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్ జిల్లాలోని నేషనల్ పార్కు అభయారణ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతిచెందిన విషయం విదితమే. ఒకరోజు వ్యవధిలోనే అదే అభయారణ్యంలో శుక్రవారం జరిగిన తరువాయి 2లో

## ఆరునూర్రైనా మూసీ ప్రక్షాళన



- ఇతర ప్రాజెక్టులూ పూర్తి చేస్తాం
- నాకేం కోరికలు లేవు.. రాష్ట్రాభివృద్ధి తప్ప..!
- కేసీఆర్.. ముందు మీ బిడ్డ ప్రశ్నలకు సమాధానం చెప్పండి
- నోటీసు ఇస్తే విచారణకు రాకుండా మాపై విమర్శలా?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్న
- గంధమల్ల రిజర్వాయర్ సహా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**జూన్ 6, నల్గొండ:** ''పదేళ్లు దోచుకుతిన్న రాబందులు మమ్మల్ని ప్రశ్నిస్తాయట.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి కమిషన్ నోటీసులు ఇస్తే, విచారణకు హాజరై జవాబు చెప్పాల్సింది పోయి మాపై విమర్శలు చేస్తున్నారు. గంధమల్ల రిజర్వాయర్‌కు నీళ్లెలా ఇస్తారని ఓ పెద్దమనిషి ప్రశ్నిస్తున్నారు. ఎస్సారెస్పీ, మిడ్ మానేరు వంటి ఎన్నో ప్రాజెక్టులు కట్టిన మాకు గంధమల్లకు నీళ్లు ఎలా ఇవ్వాలో తెలియదా? ఆరునూరైనా ఆ రిజర్వాయర్‌ను తరువాయి 2లో



### మంత్రి మండలి ఆమోదంతోనే
## బ్యారేజీల నిర్మాణం

- నాటి సీఎం కేసీఆర్ నిర్ణయంతోనే క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- నాతోపాటు, హరీశ్, తుమ్మలతో కూడిన సబ్‌కమిటీ నిర్ణయం మేరకే రీడిజైనింగ్
- కాళేశ్వరం కమిషన్ ఎదుట ఈటల రాజేందర్ వాంగ్మూలం
- తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేకనే మేడిగడ్డకు ప్రాజెక్టు మార్చినట్లు వెల్లడి
- నిర్మాణాల్లో ఆర్థికపరమైన క్రమశిక్షణ లోపించిందా అన్న జస్టిస్ ఘోష్
- ఆర్థికశాఖకు సంబంధం లేదని పేర్కొన్న ఈటల

**జూన్ 6, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలు నాటి భారాస మంత్రి మండలి నిర్ణయంతోనే జరిగాయని ఆ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేసి, ప్రస్తుతం భాజపా ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బ్యారేజీలపై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఈటల శుక్రవారం హాజరయ్యారు. బహిరంగ విచారణలో భాగంగా కమిషన్ ఆయనను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో ఉన్న కమిషన్ కార్యాలయంలో మధ్యాహ్నం అరగంట పాటు విచారించింది. ఈటలను మొత్తం 19 ప్రశ్నలను అడిగి.. వాటికి ఆయన ఇచ్చిన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. తరువాయి 2లో

### పిల్లల చదువుల కోసం
## డ్వాక్రా మహిళలకు భరోసా

- 4% వడ్డీకే స్త్రీనిధి నుంచి రూ.లక్ష రుణం
- ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా అమలు
- ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేసేలా ప్రతిపాదనలు

**జూన్ 6, అమరావతి:** డ్వాక్రా మహిళల పిల్లల చదువుకు భరోసానిచ్చేలా కూటమి ప్రభుత్వం మరో కొత్త పథకానికి రూపకల్పన చేసింది. వారి విద్యా వికాసానికి తోడ్పడేందుకు 4% వడ్డీకే (35 పైసలు) రుణాలు అందించాలని నిర్ణయించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) పరిధిలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.10వేల నుంచి గరిష్ఠంగా తరువాయి 2లో



# జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ఆటంకం రానీయను

(మొదటిపేజీ తరువాయి)

ప్రశంసించారు. పాకిస్థాన్ దాడిలో పూర్తిగా ధ్వంసమైన ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న ఒక్కో ఇంటికి రూ.లక్ష అదనపు సాయం ప్రకటించారు. "జమ్మూకశ్మీర్ యువత కలల సాకారానికి పూర్తి మద్దతునిస్తాం. దీనికి ఏ అవరోధం వచ్చినా ముందుగా నేనే అడ్డుగా నిలుస్తాను" అని ప్రధాని ఉద్ఘాటించారు. పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడటం ద్వారా కశ్మీరీ ప్రజల బతుకుతెరువును ధ్వంసం చేయాలని పాకిస్థాన్ కుట్ర పన్నిందని ఆయన అన్నారు. కశ్మీర్‌లోయలో తొలి రైల్వే సేవను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. "దశాబ్దాలుగా కొనసాగుతున్న తీవ్రవాదం కశ్మీర్‌లో పాఠశాలల్ని బుగ్గి చేసింది. రెండు తరాల భవితవ్యాన్ని నాశనం చేసింది. ఆస్పత్రులనూ వారు (ఉగ్రవాదులు) తగులబెట్టారు. స్థానికులు ఎన్నికల్లో పోటీకి నిలవడమే పెను సవాలుగా మారింది" అని అన్నారు. గతనెల 6 నుంచి 10వ తేదీ వరకూ దేశ సరిహద్దులోని పుంఛ్, జమ్మూ తదితర ప్రాంతాల్లో పాకిస్థాన్ శతఘ్ని గుండ్లు జరిపిన విధ్వంసాన్ని ప్రస్తావిస్తూ, పౌర ఆవాసాలపై దాడికి పూనుకోవడం ద్వారా పొరుగుదేశం తన నిస్సహాయతను ప్రదర్శించిందని అన్నారు.

**తొలి రైలుకు జెండా ఊపిన మోదీ**

జమ్మూకశ్మీర్‌లోని కట్రా, శ్రీనగర్ పట్టణాల మధ్య వందేభారత్ రైలు సేవలను ప్రధాని శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. దీంతోపాటు రూ.1,486 కోట్ల వ్యయంతో నిర్మించిన చినాబ్ రైల్వే వంతెనను కూడా ప్రారంభించారు. చినాబ్ నదిపై నిర్మించిన రైల్వే వంతెన ప్రపంచంలోనే అతి ఎత్తైనది కాగా.. ప్రధాని జెండా ఊపి ప్రారంభించిన కట్రాశ్రీనగర్ వందేభారత్ జమ్మూ ప్రాంతాన్ని కశ్మీర్‌తో కలిపే తొలి రైలు. చినాబ్ నదిపై నిర్మించిన రైల్వే వంతెనపై ప్రధానమంత్రి భారత జాతీయ జెండా పట్టుకొని నడిచారు. అనంతరం అంజి నదిపై నిర్మించిన కేబుల్ వంతెనను ప్రధాని ప్రారంభించారు. ఇది భారత్‌లో నిర్మించిన తొలి కేబుల్ బ్రిడ్జి. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఈ వంతెన ప్రత్యేకతలెన్నో..**

చినాబ్ నదిపై ఉపరితలానికి 359 మీటర్ల(1,178 అడుగుల) ఎత్తులో కట్టిన వంతెన ఒక వాస్తుశాస్త్ర అద్భుతం. ప్రపంచంలోనే అతి ఎత్తైన ఈ బ్రిడ్జి పారిస్ నగరంలోని ఈఫిల్ టవర్ కన్నా, న్యూయార్క్‌లోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ కన్నా ఎక్కువ ఎత్తు కలిగి ఉంది. ఉద్ధంపుర్‌శ్రీనగర్‌బారాముల్లా రైల్ లింకు ప్రాజెక్టులో భాగంగా 1315 మీటర్ల పొడవున నిర్మించిన ఈ బ్రిడ్జి భూకంపాలనేకాక ఉధృతమైన గాలుల్ని, ఇతర ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని నిలిచేలా సామర్థ్యం కలిగివుంది. కట్రాబనిహాల్ మధ్య 111 కిలోమీటర్ల పొడవున్న రైల్వే మార్గానికి ఈ బ్రిడ్జి కీలక లంకె. దీని నిర్మాణానికి 2002లోనే అనుమతి లభించింది. అయితే పనులు మాత్రం 2017లో ప్రారంభమయ్యాయి. ఈ వంతెన నిర్మాణం కోసమే 26 కిలోమీటర్ల అప్రోచ్ రోడ్డు, 400 మీటర్ల సొరంగ మార్గం నిర్మించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. వంతెన నిర్మాణంలో భాగంగా అతిపొడవైన ఉక్కు ఆర్చి(ధనువాకారంలో వంచిన లోహనిర్మాణం) అంత ఎత్తులో జతచేయడం ఒక అద్భుతం, అసాధారణం. ఈ ఆర్చి నిర్మాణాన్ని 2021 ఏప్రిల్‌లో పూర్తి చేశారు. కశ్మీర్‌లోయను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే ఈ వంతెన ఆ ప్రాంత పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు. చినాబ్ వంతెనతో పాటు ప్రధాని ప్రారంభించిన అంజి వంతెన కూడా ఒక వాస్తుకళాఖండమే. ఇది దేశంలో రెండో అతి ఎత్తైన బ్రిడ్జి. దీనిని నిర్మించాలని 2016 అక్టోబరులో నిర్ణయించారు. ఈ బ్రిడ్జిని అంజీ నదికి చెందిన లోతైన ఇరుకైన లోయపై నిర్మించారు. 725 మీటర్ల పొడవున్న ఈ బ్రిడ్జి కట్రా రియాసి పట్టణాలను అనుసంధానిస్తుంది. 331 మీటర్ల ఎత్తున్న ఈ వంతెనకు ఒక వయాడక్టు, ఒక అప్రోచ్ బ్రిడ్జి కూడా నిర్మించారు. ఉధృతమైన గాలులనే కాకుండా తీవ్రమైన పేలుళ్లనూ తట్టుకునేలా దీన్ని నిర్మించారు.

# మరో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఎదురుకాల్పుల్లో తెలంగాణ మావోయిస్టు పార్టీ సభ్యుడు (టీఎస్‌సీఎం), కుమురం భీం జిల్లా కార్యదర్శి మైలారపు ఆడేల్లు ఎలియాస్ భాస్కర్ మృతిచెందారు. ఘటనా స్థలం నుంచి ఆయన మృతదేహంతోపాటు ఏకే47 రైఫిల్, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ప్రాంతంలో అడపాదడపా కాల్పులు కొనసాగుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. భాస్కర్‌పై రూ.25 లక్షల రివార్డు ఉంది.

**40 సంవత్సరాలుగా..**

40 ఏళ్ల కిందట అడవిబాట పట్టిన మైలారపు భాస్కర్ (56) జీవితం అడవిలోనే ముగిసిపోయింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చరకు చెందిన ఆయన 90వ దశకంలో పీపుల్స్‌వార్‌లో చేరారు. తొలుత క్రాంతి పేరుతో కొరియర్‌గా పని చేశారు. 1994లో మందమర్రి మండలం మామిడిగట్టు ప్రాంతంలో పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. రెండేళ్లపాటు జైలు జీవితం గడిపారు. విడుదలైన తర్వాత మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2003లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి లలితక్క ఎన్‌కౌంటర్ తర్వాత పోలీసుల నిర్బంధం పెరగడంతో అప్పట్లో ఉత్తర తెలంగాణలోకి కీలక నేతలందరినీ మావోయిస్టు పార్టీ మహారాష్ట్రకు పంపించింది. వారిలో భాస్కర్ ఒకరు. తరువాత పార్టీలో క్రమక్రమంగా క్రియాశీలక సభ్యుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవిపై, రాజకీయాలపై సంపూర్ణ అవగాహన ఉండటంతో ఆయన్ను పార్టీ కుమురం భీం, మంచిర్యాల ఏరియా కమిటీ కార్యదర్శిగా నియమించింది.

# మంత్రి మండలి ఆమోదంతోనే బ్యారేజీల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

**నీటి లభ్యత లేకనే ప్రాజెక్టు మార్పు**

గత ప్రభుత్వంలో ఏ సమయంలో ఆర్థికమంత్రిగా పని చేశారు.. మూడు బ్యారేజీలపై నిర్ణయం ఎవరు తీసుకున్నారు.. అంటూ జస్టిస్ ఘోష్ ఈటల రాజేందర్‌కు పలు ప్రశ్నలు వేశారు. వాటికి ఈటల సమాధానాలు ఇస్తూ.. "2014 జూన్ 2 నుంచి 2018 డిసెంబరు 18 వరకు అప్పటి ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేశా. మేడిగడ్డ బ్యారేజీ కంటే ముందు రూ.38 వేల కోట్లతో తుమ్మిడిహెట్టి వద్ద నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగా.. అనుమతుల విషయంలో కేంద్ర జలసంఘం, మహారాష్ట్ర ప్రభుత్వం పలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. మహారాష్ట్రలో ముంపు ఉండటం, రక్షిత అటవీ ప్రాంతం మునుగుతుండటంతో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గించాలని మహారాష్ట్ర సూచించింది. ఈ ప్రాజెక్టు ద్వారా 30 టీఎంసీలు పట్టణ ప్రాంతాలకు, 15 టీఎంసీలు పరిశ్రమలకు, 10 టీఎంసీలు గ్రామీణ ప్రాంతాల తాగునీటికి, 16.15 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. కానీ అందుకు తగినట్లు తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదు. దీంతో బ్యారేజీని మేడిగడ్డకు మార్చాం. దీనికి సంబంధించి టెక్నికల్ కమిటీ క్షేత్రస్థాయి అధ్యయనం చేసింది. ఈ క్రమంలో పునరాకృతిపై నాటి సీఎం కేసీఆర్ క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఛైర్మన్‌గా ఉన్న కమిటీలో నాతోపాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సభ్యులుగా నియమించారు.

# రోజూ ప్రయాణించేది 6.50 లక్షల మంది!

(మొదటిపేజీ తరువాయి)

మంది రాకపోకలు సాగిస్తారని డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఇవీ వాటి వివరాలు...

**కారిడార్ 10: జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు**

* 24.5 కి.మీ. మార్గమిది. 18 స్టేషన్లు రానున్నాయి.
* ఈ మార్గంలో జేబీఎస్ న్యూ, డైమండ్ పాయింట్, బాపూజీనగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి, బోయిన్‌పల్లి చెక్‌పోస్టు, డెయిరీఫాం, సుచిత్ర జంక్షన్, పైప్‌లైన్‌రోడ్, అంగడిపేట్, దూలపల్లి ఎక్స్‌రోడ్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, ఈఎంఆర్ఐ, కండ్లకోయ, ఓఆర్ఆర్ మేడ్చల్, మేడ్చల్ చెక్‌పోస్ట్, మేడ్చల్‌లో ముఖ్యమైన స్టేషన్లు వచ్చే అవకాశముంది.
* వ్యయం రూ.6,946 కోట్లుగా అంచనా వేశారు.
* ఈ మార్గం పూర్తైతే 2030 నాటికి నిత్యం 2.54 లక్షల మంది ప్రయాణిస్తారని, 2055 నాటికి ఈ సంఖ్య 5.70 లక్షలకు చేరే అవకాశముందన్నారు.

*** కారిడార్ 11: జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు**

v 22 కి.మీ. మార్గమిది. 14 స్టేషన్లు వస్తాయి.

* జేబీఎస్ న్యూ, విక్రంపురి, కార్ఖానా, తిరుమలగిరి ఎక్స్‌రోడ్, లాల్‌బజార్, లోతుకుంట, అల్వాల్, రాష్ట్రపతి నిలయం కూడలి, బొల్లారం, హకీంపేట, దేవరయంజాల్, తూంకుంట, ఓఆర్ఆర్ శామీర్‌పేట, శామీర్‌పేట ప్రాంతాల్లో స్టేషన్లు వస్తాయి.
* వ్యయం రూ.5,465 కోట్లుగా అంచనా వేశారు.
* 2030 నాటికి నిత్యం ఈ మార్గంలో 1.92 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా. 2055 నాటికి వారి సంఖ్య 3.74 లక్షలకు పెరుగుతారని పేర్కొన్నారు.
* 1, 2, 3 కారిడార్లు కలిపి 69.2 కి.మీ. ఇప్పటికే ఆపరేషన్‌లో ఉంది.
* మెట్రో 2(ఏ)లో భాగంగా 4, 5, 6, 7, 8 కారిడార్లలో 76.4 కి.మీ. ప్రతిపాదించి కేంద్రం అనుమతికి 2024 నవంబరులో పంపించారు.
* కారిడార్ 9 శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు
* 39.6 కి.మీ. మార్గమిది. తొమ్మిది స్టేషన్లు ప్రతిపాదించారు.
* విమానాశ్రయం నుంచి మాన్‌సాన్‌పల్లి రోడ్, ఓఆర్ఆర్ సర్వీస్ రహదారి వెంట పెద్దగోల్కొండ, తుక్కుగూడ, రావిర్యాల ఎగ్జిట్ వరకు వెళుతుంది. రావిర్యాల నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ రహదారి మధ్యలోంచి భూమార్గంలో 17.1 కి.మీ. ఉంటుంది.
* ఈ మార్గంలో ఆర్‌జీఐఏ, పెద్దగోల్కొండ, బహదూర్‌గూడ, తుక్కుగూడ, రావిర్యాల, కొంగరకలాన్, రాచలూరు, గుమ్మడవెల్లి, స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంతాల్లో స్టేషన్లను ప్రతిపాదించారు.
* వ్యయం రూ.7,168 కోట్లుగా అంచనా వేశారు.

2029 నాటికి ప్రయాణికుల సంఖ్య 1.98 లక్షలు ఉంటుందని.. 2055 నాటికి 6.03 లక్షలకు పెరుగుతుందని అంచనా వేశారు.

# పొగాకు, మామిడి, కోకో రైతులకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేస్తాం" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. భారాస నాయకులను లక్ష్యంగా చేసుకుని నిప్పులు చెరిగారు. ఆరునూరైనా మూసీ ప్రక్షాళన చేసితీరతామన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామంలో సుమారు రూ.1,051 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే తొమ్మిది అభివృద్ధి పనులకు సంబంధించి ఒకేచోట ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలాకాలను సీఎం ఆవిష్కరించారు. వీటిలో గంధమల్ల జలాశయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ప్రభుత్వ వైద్య కళాశాల భవనం, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 12 వార్డుల అభివృద్ధి పనులు తదితరాలున్నాయి. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమాల సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో సీఎం మాట్లాడారు. "గత సర్కారు పదేళ్ల హయాంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు వేయలేదు. రాష్ట్రంలోని 5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మేం ఒకటో తేదీనే వేతనాలు జమ చేస్తున్నాం. ఉద్యోగులకు రెండు డీఏలు ప్రకటిస్తే మెచ్చుకోవాల్సింది పోయి విమర్శిస్తున్నారు. ఆనాడు కేసీఆర్ వాసాలమర్రికి వచ్చి ఆకుల ఆగవ్వకు అల్లనేరేడు పండు ఇచ్చి ఆసుపత్రిపాలు చేశారు. వాసాలమర్రిలో ఇళ్లు కూలగొట్టి శ్మశానంలా మార్చారు. ఆయన ఆగం చేసినా.. వాసాలమర్రి పరిస్థితిని బాగు చేయాలని మా నాయకులను ఆదేశిస్తున్నా. ఇవాళ కేసీఆర్‌కు ఒక నోటీసు ఇస్తేనే ఆగమాగం అవుతున్నారు. నెలల కొద్దీ జైలు జీవితం గడిపిన మేమేం అనుకోవాలి. ఆనాడు ప్రధానమంత్రిగా పనిచేసిన పీవీ నరసింహారావు ఒక కేసులో సెషన్స్ జడ్జి ముందు హాజరయ్యారు. మరి కేసీఆర్‌కు ఎందుకు మినహాయింపు? తన తండ్రి చుట్టూ దెయ్యాలున్నాయని ఆ ఇంటి ఆడబిడ్డ బహిరంగంగా ప్రకటించినా.. ఆ నాయకుడు సమాధానమివ్వకుండా ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. ముందు మీ బిడ్డ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. ఇకపై ఆ పార్టీని బీఆర్ఎస్ అని పిలవద్దు. దెయ్యాల రాజ్య సమితి (డీఆర్ఎస్) అని పిలవాలి. ఆ పార్టీలో ఉన్న కొరివి దెయ్యాలను తెలంగాణ పొలిమేర వరకు తరిమికొట్టాలి.

**టీటీడీ తరహాలో వైటీడీ అభివృద్ధి**

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. టీటీడీలా యాదగిరిగుట్టకు వైటీడీ పేరిట ప్రత్యేక బోర్డు, కమిటీని ఏర్పాటు చేశాం. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. ఆనాటి ప్రభుత్వం యాదగిరిగుట్టను యాదాద్రి అని మార్చడం, గుట్టపైన సామాన్యుల దుకాణాలు తొలగించడం, భక్తులకు వసతులు లేకుండా చేయడంతో.. ఆ స్వామి ఆగ్రహించి ఆ పార్టీ ఓడిపోయేలా చేశారు. మేం అధికారంలోకి రాగానే యథాతథంగా యాదగిరిగుట్ట పేరును ఉంచాం. గుట్టపై భక్తులు నిద్ర చేసేందుకు త్వరలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. తిరుపతి తరహాలోనే గుట్టలో వైద్య కళాశాల, అన్ని కోర్సులతో ప్రపంచ స్థాయి యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం.

*** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం**

గత ఏడాది నవంబరు 8న నా పుట్టినరోజు సందర్భంగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని.. మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని మాట ఇచ్చా. ఆరునూరైనా దీంతోపాటు మిగిలిన ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం. మూసీ పక్కన చిన్న ఇళ్లు వేసుకుని ఉన్న ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రజలను విపక్ష నాయకులు రెచ్చగొట్టి ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారు. వారిని తొక్కుకుంటూ ముందుకు వెళతాం. ఆనాటి ప్రభుత్వంలో రూ.20 లక్షల కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని గొప్పలు చెప్పిన నాయకులు.. రూ. 2 వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందించాం. ఇందిరా మహిళా శక్తి పథకం కింద రుణాలు అందించి పదేళ్లలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రుణాల చెక్కులను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జైవీర్ రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, శ్రీపాల్‌రెడ్డి, నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల చదువుల కోసం డ్వాక్రా మహిళలకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

రూ.లక్ష వరకు రుణం అందించనున్నారు. ప్రస్తుతం స్త్రీనిధి ద్వారా డ్వాక్రా సభ్యులకు 11% వడ్డీతో రుణాలిస్తున్నారు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రుల చేతిలో డబ్బులు లేక బయట ఎక్కువ వడ్డీలకు తెచ్చి అప్పులపాలవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం.. వారికి చేయూతగా నిలిచేందుకు కొత్త పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా ఈ పథకానికి నామకరణం చేస్తూ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. కేజీ నుంచి పీజీ వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు వర్తింపచేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా త్వరలో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులు కసరత్తు పూర్తి చేశారు. స్త్రీనిధి నుంచి రుణంగా తీసుకునే మొత్తాన్ని పిల్లల చదువుకే వినియోగించాలి. వారి ఫీజు చెల్లింపులు, పుస్తకాలు, యూనిఫాం, ఇతర వాటి కొనుగోలుకు వెచ్చించవచ్చు. సాంకేతిక విద్యలో అవసరాలకు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. నివాస ప్రాంతం నుంచి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లేందుకు సైకిళ్ల కొనుగోలుకు అనుమతిస్తారు. అయితే ఎందుకోసం వినియోగించామో సంబంధిత రసీదును స్త్రీనిధి అధికారులకు అందించాలి. రుణ మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాలి. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా కనిష్ఠంగా 24 నెలల నుంచి గరిష్ఠంగా 36 నెలల వరకు చెల్లించే వెసులుబాటు కల్పిస్తారు. ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించారు.

# అలరిస్తున్న మసులా బీచ్ ఫెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

తీర్చిదిద్దుతామన్నారు. ఒకే బీచ్ వేదికగా సాంస్కృతిక, సాహస, క్రీడా కార్యక్రమాలు నిర్వహించి పర్యాటక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కయాకింగ్ పోటీలను 14 ఏళ్ల బాలుర విభాగంలో నిర్వహించగా 500 మీటర్ల విభాగంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సౌరబ్‌సాహు, తమిళనాడుకు చెందిన రియాస్‌ఖాన్, మొహమ్మద్ ఇర్ఫాన్ వరుసగా మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలికల 14 ఏళ్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చరితశ్రీ, మహారాష్ట్రకు చెందిన సాయిక్షీర్నజ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వర్షిత వరుసగా మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.

**కట్టి పడేస్తున్న కబడ్డీ**

జాతీయ బీచ్ కబడ్డీ, సీకయాకింగ్, సాహస విన్యాసాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. 23 రాష్ట్రాలకు చెందిన 1,016 మంది క్రీడాకారులు పాల్గొన్న టోర్నీలో కబడ్డీ జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. గురువారం రాత్రి జరిగిన సీనియర్ మహిళా విభాగం పోటీల్లో బిహార్‌పై ఉత్తర్‌ప్రదేశ్, గోవాపై హరియాణా, దిల్లీపై ఆంధ్రప్రదేశ్, విదర్భపై హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణపై పశ్చిమబెంగాల్, పుదుచ్చేరిపై పంజాబ్, ఉత్తరాఖండ్‌పై తమిళనాడు, కర్ణాటకపై రాజస్థాన్ విజయం సాధించాయి. పురుషుల విభాగంలో ఒడిశాపై కేరళ, విదర్భపై దిల్లీ, ఛత్తీస్‌గఢ్‌పై మహారాష్ట్ర, ఝార్ఖండ్‌పై హరియాణా, తెలంగాణపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటకపై ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌పై తమిళనాడు గెలుపొందాయి. చాలా జట్లు పదుల పాయింట్ల తేడాతో ఓటమి పాలయ్యాయి. సాహస క్రీడలకు వెల్లువలా జనం: రెండోరోజు నుంచి హెలికాప్టర్ రైడ్ మొదలైంది. 7 నిమిషాల రైడ్‌కు రూ.4,500 తీసుకున్నా హెలికాప్టర్‌లో విహరించేందుకు పర్యాటకులు పెద్దఎత్తున ఆసక్తి చూపారు. అలాగే జెట్‌స్కీపై విహరించేందుకు ధరను రూ.250గా నిర్ణయించడంతో వందలమంది ఉత్సాహం చూపించారు. పారాగ్లైడింగ్, ఇతర సాహస క్రీడలపై ఏమాత్రం క్రేజ్ తగ్గలేదు. శుక్రవారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.





# రెవిన్యూ అధికారులు ఎక్కడ?










* **కార్యాలయానికి దూరంగా.....! కుత్బుల్లాపూర్ రెవిన్యూ అధికారుల్లో సమన్వయ లోపం!:**
* **హైడ్రా మీటింగ్..... రెవిన్యూ శిక్షణ తరగతులతో అంటూ!....:**
* **గందరగోళంలో విద్యార్థులు:**
* **కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలకై విద్యార్థుల ఇబ్బందులు**
* **అధికారుల షెడ్యూల్ సూచిక బోర్డు పెట్టాలంటున్న ప్రజలు!:**
* **జిరాక్స్ సెంటర్ ల దందాలో రెవిన్యూ సిబ్బంది పాత్ర వుందా?**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో పని భారమో మరేదైనా కారణమో కానీ సమన్వయ లోపంతో కుత్బుల్లాపూర్ రెవిన్యూ అధికారులు కార్యాలయంలో చూద్దామన్నా కనిపించడం లేదు. ఏ అధికారి సెక్షన్ చూసినా తలుపు గడియ పెట్టి ఉంటుండడంతో అక్కడికి వచ్చే ప్రజలు రెవిన్యూ అధికారుల దర్శనం కోసం పడిగాపులు కాస్తున్నారు. అధికారుల జాడ కోసం ప్రజలు కార్యాలయంలో సిబ్బందిని ఆరా తీస్తే ఫీల్డ్ కు వెళ్లారని, హైడ్రా ఆఫీస్ కు మీటింగ్ వెళ్లారని, రెవిన్యూ అధికారుల శిక్షణ తరగతులకు వెళ్లారని జవాబిస్తున్నారు. విద్యా సంవత్సరం మొదలైన తరుణంలో రెవిన్యూ అధికారులు అందుబాటులో ఉండకపోవడతో కుల, ఆదాయ ధృవీకరణలో జాప్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవిన్యూ అధికారులకు శిక్షణ తరగతులు, హైడ్రా అధికారులతో సమావేశం అంటూ ఏ ఒక్క అధికారి కార్యాలయంలో ఉండకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.ఏ అడ్మిషన్స్ కోసం అయినా కుల, ఆదాయ ధ్రువీకరణ తప్పనిసరిగా కావాల్సి ఉండగా వాటి కోసం విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు.మండల పరిధిలో పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులే సుమారు యాభై వేల మంది ఉండగా ఇంటర్, డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులు వేల సంఖ్యలో వుంటారు. వారంతా ఉన్నత చదువుల కోసం కుల, ఆదాయ సర్టిఫికెట్ లకోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది! పైసలిస్తే పని సులువు అంట!: కుత్బుల్లాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు ఎప్పుడు వుంటారో? ఎప్పుడు ఉండరో తెలియని పరిస్థితి నెలకొంది!దీంతో కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం దగ్గర వున్న జిరాక్స్ సెంటర్ ల నిర్వాహకులు కొంతమంది ఇదే అదనుగా ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ కు ఇంత, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇప్పిస్తే ఇంత అని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే వారితో బేరం కుదుర్చుకుని విద్యార్థుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికారుల దర్శనం ఎప్పుడు అవుతుందో తెలియని ప్రజలు జిరాక్స్ సెంటర్ వారికి ఎంతో కొంత ముట్టజెప్పి ధ్రువీకరణ పత్రాలు ఇప్పించే బాధ్యత వారికే అప్పజెప్పుతున్నారని వినికిడి. ఉన్నతాధికారులు స్పందించాలి: పలు రకాల సర్టిఫికెట్ ల కోసం కుత్బుల్లాపూర్ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు ఓ వైపు ఇంటర్, డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలవగా మరోవైపు రెవిన్యూ అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో కుల, ఆదాయ దృవికరణలో ఆలస్యం అవడంతో ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విధి నిర్వహణ లో అధికారులు ఎంత బిజీగా వున్నా ఏ సదస్సులో పాల్గొన్నా, ఎక్కడ మీటింగ్ కు హాజరైనా ఎవరో ఒక అధికారి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి విద్యార్థులకు సర్టిఫికెట్ ల జారీ లో ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రెవిన్యూ అధికారులు కుత్బుల్లాపూర్ తహశీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.లేదా అధికారులు కార్యాలయంలో ఏ సమయంలో వుంటారో అనే విషయం కార్యాలయం ముందు ఒక సూచిక బోర్డు అయినా ఏర్పాటు చేయాలని కుత్బుల్లాపూర్ మండల ప్రజలు కోరుతున్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నూతన అధ్యక్షునికి సన్మానం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రెడ్డి సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షుడు గుండారపు కృష్ణా రెడ్డిని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముస్తాబాద్ సెస్ కార్యాలయంలో శుక్రవారం రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు గుండారపు కృష్ణా రెడ్డికి ఆయన పూలబొకే అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నర్సింహారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు కుంబాల మల్లారెడ్డి, కొండం రాజిరెడ్డి, కరెడ్ల తిరుమల రెడ్డి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, ముస్తాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

* **ముత్తారం మండల విద్యాధికారి నిమ్మరాజిరెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ముత్తారం మండల విద్యాధికారి నిమ్మరాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, గ్రామాల్లో బడి బాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, నాణ్యమైన విద్య, భోజన సౌకర్యం కల్పిస్తారని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

* **నింధితుడు రిమాండ్**
* **వివరాలను వెల్లడించిన బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేష్ కుమార్**







కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రెడ్డి ల్యాబ్స్ పక్కన కలకలం రేపిన ట్రావెల్ బ్యాగ్‌లో మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. మహిళను హత్య చేసిన నింధితుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. శుక్రవారం షాపూర్ నగర్లోని బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేష్ కుమార్ వివరాలను వెల్లడించారు. నేపాల్ దేశానికి చెందిన విజయ్ తోపా(26) నేపాల్ కు చెందిన ఇద్దరు పిల్లల తల్లి తారాబెహరా (33) తో అక్రమ సంబంధం పెట్టుకుని 2 నెలల క్రితం హైదరాబాద్ కు తీసుకొచ్చాడు. అతడు బౌరంపేట్ లోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తారా బెహరా 2 నెలల గర్భవతి కావడంతో ఇద్దరికి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో విజయ్ తోఫా తారా బెహరా మెడకు చున్నీ చుట్టి మే 23 న హత్య చేసి మృత దేహాన్ని ట్రావెల్ బ్యాగ్‌లో ఉంచి బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి రెడ్డి ల్యాబ్స్ పక్కన నిర్మాణుష ప్రదేశంలో పడేసి వెళ్ళాడు. ఠీతో ట్రావెల్ బ్యాగ్ ను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రావెల్ బ్యాగ్ను తెరిచి చూడగా అందులో ఓ మహిళ మృత దేహం ఉంది. దీంతో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నింధితుడిని పట్టుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నింధితుడు విజయ్ తోపా ని రిమాండ్కు తరలించారు. మహిళ హత్య కేసును 24 గంటలలో ఛేదించిన బాలానగర్ ఎస్ఓటి, బాచుపల్లి పోలీసులను డీసీపీ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ రవికిరణ్ రెడ్డి, బాలానగర్ ఎస్ఓటీ సీఐ శివకుమార్, బాచుపల్లి సీఐ ఉపేందర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విదేశాలలో వైభవంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బహ్రెయిన్ దేశంలో తెలంగాణ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సాంస్కృతిక సంఘ సభ్యులు, అతిథులు ప్రేమ్ సాగర్, పోచన్న, వెంకటస్వామి, మురళీ, సుదర్శన్, కిరణ్, రాజశేఖర్, నవీన్, కిషోర్, సంజీవ్, శంకర్, అభిలాష్, నర్సిరెడ్డి, మల్లేష్, సుదర్శన్, శ్రీనివాస్, వాసు, ప్రవాస తెలంగాణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, భాష, ఉద్యమ గౌరవం గురించి అద్భుతమైన ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా అభిలాష్, అరుణ్ ఆలపించిన జానపద గీతాలు, దేశభక్తి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. మాతృభూమి తెలంగాణ పట్ల గౌరవాన్ని, భక్తిని ఇంకా బలోపేతం చేసేలా ఈ వేడుకలు జరిగాయి.

## నిర్బంధ పాలన చేయడం అప్రజాస్వామ్యం

**: సట్టు తిరుమలేష్**



రాజపేట, ప్రజా స్ఫూర్తి : ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని టిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని బిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ విమర్శించారు. శుక్రవారం రాజపేట పోలీసులు ముఖ్యమంత్రి సమావేశానికి ముందస్తు అరెస్టులు చేసి వలిగొండ పోలీస్ స్టేషన్ కు తరలించిన సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రజల గొంతును వినిపించేందుకు ప్రయత్నం చేస్తున్న టిఆర్ఎస్ పార్టీని గొంతు నొక్కడం న్యాయం కాదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల పోరాం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, మదర్ డైరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్రామిరెడ్డి, టిఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పల్లె సంతోష్ కుమార్, తాజా మాజీ సర్పంచులు గోపి, పంబ కర్ణాకర్, భాస్కర్ ఎర్రగోకుల జస్వంత్, పల్లె ప్రవీణ్ కనకయ్య తదితరులున్నారు.

## అనాధ ఆశ్రమానికి హార్ట్ టూ హెల్ప్ చేయూత



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మోతీ నగర్ లో గల శ్రీ ఆదర్శ చిల్డ్రన్ హోమ్ అనాధాశ్రమానికి దాతల సహకారంతో హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఎడీఈ జి .చైతన్య స్పందించి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న 30 మంది అనాధ పిల్లల కోసం ప్రతి నెల పాల ఖర్చును హోమ్ నిర్వాహకులు నాగేశ్వరావు కి రూ. 9,200 ల చెక్కును అందించడం జరిగిందన్నారు.

## హైకోర్టు జడ్జి భీమపాక నగేష్ ను కలిసిన జిల్లా కలెక్టర్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం పర్యటనకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు జడ్జి భీమపాక నగేష్ ను శుక్రవారం సారపాక ఐటిసి గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు

## సింగరేణి జేఏసీ నాయకుల మీద పోలీస్ కేసులు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థలో ప్రైవేటికరణకు వ్యతిరేకంగా , సింగరేణి ప్రాంతంలో ఉన్న కోల్ బ్లాకులను తెలంగాణ రాష్ట్ర మనుగడకై సింగరేణికే కేటాయించాలని జరిగిన సమ్మెలో సింగరేణిలో ఉన్న జాతీయ కార్మిక సంఘాలైనట్టి ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ,టిబిజికేయస్, బిఎంయస్ , ఇఫ్టు సంఘాలు 2020లో కోవిడ్ సమయంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన సందర్భంలో కొత్తగూడెం 1 టౌన్ పోలీస్ వారు కోవిడ్ రూల్స్ ని వ్యతిరేకించారని 18 మంది జేఏసీ నాయకులు , వారి కార్యకర్తల మీద కేసు పెట్టడం జరిగింది. 1టౌన్ పోలీస్ వారు గత నెలలో ఈ 18 మందికి సమన్లు పంపి గతనెల 29 న కోర్టుకు హాజరుకమ్మని కోరడం జరిగింది. వీరు లాయర్ ద్వారా మెమోను కోర్టు కు అందించగా కోర్టు పిలుపుపై శుక్రవారం జేఏసీ నాయకులు కోర్టు వాయిదాకు హాజరుకావడం జరిగింది. మరల ఈ కేసును గౌరవ కోర్టు తదుపరి వాయిదా జూలై 24 కు వేయడం జరిగింది. బొగ్గురంగ పరిశ్రమలో కార్మికుల నిరంతర హక్కులకై మరియు బొగ్గు పరిశ్రమను ప్రైవేటీకరించకుండా పోరాటాలు చేస్తున్న జేఏసీ నాయకుల మీద కేసులు బనాయించి ఇబ్బదులకు గురిచేస్తున్న ప్రభుత్వ, సింగరేణి యజమాని విధానాలను జేఏసీ నాయకులు ఖండించారు. పోలీస్ కేసులు అరెస్టులు తమ పోరాటాలను ఆపలేవని, తాము నిత్యం కంపెనీ , కార్మికుల శ్రేయస్సుకి పాటుపడతామని నాయకులు వంగ వెంకట్, త్యాగరాజన్, మంద నరసింహారావు, మాధవ్ నాయక్, ఏవి రామారావు, సోమిరెడ్డి, సంజీవ్ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు.

# కోట్లాది రూపాయల తో కుత్బుల్లాపూర్ లో మౌలిక వసతులు కల్పించాం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ లోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించామని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు.శుక్రవారం జీడిమెట్ల డివిజన్ మహా నగర్ ఎస్టేట్స్ లో సుమారు రూ.11 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్, పార్కును బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆటవిడుపుగా, పెద్దలకు శారీరక, మానసిక ప్రశాంతత చేకూర్చడంలో పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఓపెన్ జిమ్ ల ఏర్పాటుతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ లోని అన్ని ప్రాంతాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, పార్కులను అభివృద్ధి చేశామని అన్నారు. 2023 ఎన్నికల్లో చేసిన అభివృద్ధిని చూసి మీరందరూ గెలిపించిన ఎమ్మెల్యేగా రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రా రెడ్డి, మహా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నార్లకంటి కుమార్, ఉపాధ్యక్షులు బి. రవీందర్, పి .సురేష్,




ప్రధాన కార్యదర్శి డి. వెంకట్ రెడ్డి, కోశాధికారి ఎస్.ధర్మయ్య, సంయుక్త కార్యదర్శి కె. కవి రాజ్, ఈశ్వర్, సలహాదారులు శ్రీనివాస్, నర్సింగ్ రావు, గణేష్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, వినోద్, శ్రీనివాస్, వెంకటేష్, రాజశేఖర్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళీ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, యేసు, ఆటో బలరాం, నదీమ్ రాయ్, కుంట వేణు, నారాయణ, కాలే గణేష్, శ్రీకాంత్, విజయ్ హరీష్, బాల మల్లేష్, మహిళా నాయకురాలు అరుణా రెడ్డి, ఇందిరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణం పూర్తయిన మహిళా భవనాన్ని పరిశీలించిన కార్పొరేటర్



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వెంకట్ రామ్ రెడ్డి నగర్ లో నూతనంగా నిర్మాణం పూర్తి చేసిన మహిళా భవనాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు నిధులతో కాలనీలోని మహిళలకు ఉపయోగపడేలా పక్కా భవన నిర్మాణం చేపట్టామన్నారు. త్వరలోనే భవనాన్ని ప్రారంభించుకుని కాలనీలోని మహిళలకు అందుబాటులో తెస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రామ్ రెడ్డి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సతీశ్ గట్టోజి, మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ రషీద్, డివిజన్ ఇంచార్జ్ కార్తిక్ గౌడ్, నాయకులు జగదీష్, కాలనీ నాయకులు సంతోష్ గౌడ్, కనకరాజు, తేజ యాదవ్, సోమరాజు , స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం



జగద్గిరిగుట్ట, ( ప్రజాస్ఫూర్తి ) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జగదీశ్వర్, నందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కార్తిక్ గౌడ్, తేజయాదవ్, దేవస్థాన కమిటీ సభ్యులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజయ దుర్గా దేవి సమేత బంగారు మైసమ్మ దేవాలయ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



కుత్బుల్లాపూర్, ( ప్రజాస్ఫూర్తి) :కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీ లోని శ్రీ విజయ దుర్గాదేవి సమేత బంగారు మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్షిక బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీ లోని శ్రీ విజయ దుర్గాదేవి సమేత బంగారు మైసమ్మ దేవాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ని అహ్వానిస్తూ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటస్వామి, సెక్రెటరీ యాదగిరి, సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, శివ, బాలస్వామి, దొరబాబు, కుమార్, సూరి, వినోద్, మహేష్, శేఖర్, ప్రేమ్ కుమార్, దేముడు, రాము, జ్ఞానేశ్వర్, శోభన్, రవీందర్, రవి, రాము మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.



## హామీలను నెరవేర్చుకునే సత్తా లేక ప్రజా క్షేత్రంలో ఓడిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

*** ఆందోళన చేస్తున్న ప్రజలు, రైతులపై ఆత్మహత్య కేసులు పెట్టడం సరికాదు**

*** బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెలి సురేందర్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గద్దెనెక్కడానికి అడ్డగోలు హామీలను ఇచ్చి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీలను నెరవేర్చుకునే సత్తాలేక ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోతూ... మరోపక్క ప్రజలను ఇబ్బంది పెట్టేటువంటి కార్యక్రమాలు చేస్తున్నదని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ముస్తాబాద్ మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహ రెడ్డి , ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ ఆందోళన చేస్తున్న గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద జన్వాడ గ్రామ రైతులపై ఆత్మహత్య కేసులు పెట్టడం సమంజసం కాదని తీవ్రంగా ఖండిరచారు. ముస్తాబాద్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాలుష్యాన్ని వెదజల్లే ఇత్తనాలు ఫ్యాక్టరీ తమ ప్రాంతంలో పెట్టవద్దని గత పది నెలలుగా పోరాటం చేస్తున్న పెద్ద జన్వాడ గ్రామ ప్రజలు, రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం విచక్షణ రహితంగా చితకబాదించి, అక్రమంగా 17 సెక్షన్ల కింద కేసులు పెట్టి, 12 మంది రైతులను రిమాండ్‌కు తరలించడాన్ని, అదేవిధంగా, ఓ పత్రిక ఎడిటర్ రెహమాన్‌పై కేసు పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండిరచారు. కాలుష్యాన్ని వెదజల్లే ఇథనాల్ ఫ్యాక్టరీని పెట్టవద్దని తద్వారా ఆ ప్రాంత ప్రజలకు, రైతులకు నష్టం జరుగుతుందని ప్రభుత్వాన్ని వేడుకున్న రైతులు చేసేదేమీలేక రైతులే తిరగబడితే, తిరగబడ్డ రైతులను తీవ్రంగా కొడుతూ వారిపై ఇష్టం వచ్చిన రీతిలో నచ్చిన సెక్షన్ల క్రింద కేసులు పెట్టి ప్రజలను, రైతులను ఇబ్బంది పెడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరును, యావత్ తెలంగాణ సమాజం చూస్తుందని అన్నారు. రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, పార్టీ సీనియర్ నాయకులు చెవుల మల్లేష్, ముక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అందుబాటులో ఫీజులు... ప్రతినెల తల్లిదండ్రుల సమావేశాలతో సలహాలు



రాజపేట, ప్రజా స్ఫూర్తి : పేదలకు అందుబాటులో ఫీజులు ఉండడంతో పాటు ప్రతినెల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి అవసరమైన సలహాలు సూచనలు స్వీకరించి అమలు చేస్తామని నాణ్యమైన విద్యను అందించి పిల్లలు వారి తల్లిదండ్రుల లక్ష్యాలు నెరవేరుస్తామని రెయిన్ బో పాఠశాల యాజమాన్యం తెలిపారు. శుక్రవారం రాజపేట మండల కేంద్రంలో రెయిన్ బో ప్రాథమికోన్నత పాఠశాల ఇంగ్లీష్ మీడియంను ప్రారంభిస్తున్న సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. చలివేదుల రాజేశ్వర శర్మ పూజలు నిర్వహించగా సరస్వతి అమ్మవారికి యాజమాన్యం కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల మండలమైన రాజపేటలో పిల్లలకి ఇంగ్లీష్ మీడియం బోధన అనుకూలమైన ఫీజులతో చేస్తామన్నారు. కేరళ టీచర్ల చే బోధన, అనుభవజ్ఞులైన శ్రద్ధ గల ఉపాధ్యాయులు, కంప్యూటర్ విద్య, విశాలమైన తరగతి గదులు, సృజనాత్మకత, ఆవిష్కరణలపై దృష్టి, స్పోకెన్ ఇంగ్లీష్ కోసం ప్రత్యేక తరగతులు, క్రీడలు విద్యేతర కార్యకలాపాల నిర్వహణ, వ్యక్తిత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతినెల తల్లిదండ్రులతో సమావేశాలు, రవాణా సదుపాయం ఇలాంటి కార్యక్రమాలతో ముందుకెళుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అరవింద్, పునరాజ్ సింగ్, కపిల్, సిల్వేరు శేఖర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పలువురు గ్రామ పెద్దలు, యువకులు, తాజా మాజీ సర్పంచ్ ఆడెపు ఈశ్వరమ్మ, శ్రీశైలం, శ్రీ సరస్వతి కళాశాల ప్రిన్సిపాల్ సోమసాని సురేందర్, సీనియర్ జర్నలిస్టు ఠాగూర్ హిమ్మత్ సింగ్, జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా పాఠశాల యాజమాన్యాన్ని చేనేత శాలువాలతో సత్కరించారు. ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

## సూరారంలో "హోటల్ తులిప్స్ గ్రాండ్ ప్రారంభం



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి: సేవారంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారాలలో హోటల్ రంగం ఒకటని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం సూరారం ప్రధాన రహదారిలోని మల్లారెడ్డి హాస్పిటల్ ప్రక్కన నూతనంగా ఏర్పాటుచేసిన "హోటల్ ఫిలిప్స్ గ్రాండ్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై "హోటల్ తులిప్స్ గ్రాండ్" ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక శాఖలను ఏర్పాటుచేసి ప్రజలలో మంచి పేరును సంపాదించిన హోటల్ తులిప్స్ గ్రాండ్ సూరారం శాఖ మరింత దినదినాభివృద్ధి చెందాలన్నారు. రెస్టారెంట్ తో పాటు, బ్యాంకెట్ హాల్ లను ఏర్పాటు చేయడం ద్వారా శుభకార్యాలు నిర్వహించుకునే వారికి హోటల్ తులిప్స్ గ్రాండ్ అనువుగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, విజయ్ శేఖర్ గౌడ్, హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుక క్షేమమే..!!



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఓ చిలుక ఎగరలేని పరిస్థితిలో రోడ్డుపై వాలింది.. వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం ఉదయం కొత్తగూడెంలోని వారపు సంత సమీపంలో ఓ చిలుక ఎగరలేని పరిస్థితిలో రోడ్డుపై వాలింది.. భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండగా ఆ చిలుక తన ప్రాణాలను కాపాడుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతుండగా ఓ వ్యక్తి చూసి దాని కాపాడడంతో అది ప్రాణాలతో బయటపడింది. ఆ చిలుక ప్రస్తుతం ఆ వ్యక్తి వద్దని సేద తీరుతుంది..

## రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తా

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ రుక్మిణీ ఎస్టేట్స్ నందు సుమారు రూ.41.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రా రెడ్డి, రుక్మిణి ఎస్టేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్, కాలనీ వాసులు నర్సింహులు, శంకర్ రెడ్డి, శివ కుమార్, స్వామి, నవీన్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళీ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, యేసు, ఆటో బలరాం, నదీమ్ రాయ్, కుంట వేణు, నారాయణ, కాలే గణేష్, శ్రీకాంత్, విజయ్ హరీష్, బాల మల్లేష్, మహిళా నాయకురాలు అరుణా రెడ్డి, ఇందిరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : సూరారం డివిజన్ సూరారం గ్రామం అయ్యప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన బంగారు మైసమ్మ దేవాలయంలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొలిచిన వారి కొంగు బంగారంగా "బంగారు మైసమ్మ" ప్రజలను అనుగ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, అయ్యప్ప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా రెడ్డి, ఉపాధ్యక్షులు శివ కుమార్, కాలనీవాసులు శ్రీనివాస్ రెడ్డి, హనుమంత్ రావు, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైబిజ్ టీవీ కార్యాలయ సందర్శించిన

# మిస్ యూనివర్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఫైనలిస్ట్‌లు




హైదరాబాద్, జూన్ 6, (ప్రజాస్ఫూర్తి): మిస్ యూనివర్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ 2025 పోటీల ఫైనలిస్ట్‌లు 30 మంది ఈ రోజు హైదరాబాద్‌లోని హై బిజ్ టీవీ కార్యాలయాన్ని సందర్శించారు. హై బిజ్ టీవీ ఆతిథ్యం ఇచ్చిన ఈ కార్యక్రమంలో కంటెస్టెంట్లు మాట్లాడుతూ.. తమ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక సమస్యలపై చర్చించారు. మిస్ యూనివర్స్ ఏపీ, తెలంగాణ కార్యక్రమంలో మీడియా పార్టనర్‌గా ఉన్న హైబిజ్ టీవీ కార్యాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని కంటెస్టెంట్లు అన్నారు. తెలుగు వారిని ప్రోత్సహించడంలో హైబిజ్ టీవీ చూపిస్తున్న ఆసక్తికి ముగ్ధులయ్యామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిస్ యూనివర్స్ కంటెస్టెంట్లతో పాటు... ఏపీ డైరెక్టర్ డాక్టర్ సునీతా, మిస్ యూనివర్స్ తెలంగాణ డైరెక్టర్ ప్రసాద్ గారపాటి, ఏపీ కోఆర్డినేటర్ నిరుపమా, తెలంగాణ కోఆర్డినేటర్ రితీష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, హై బిజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.రాజగోపాల్, హై బిజ్ ఎల్ఎల్‌పి ఎమ్.డీ జె.సంధ్యారాణీ, భారతీ సిమెంట్ నుండి మల్లారెడ్డి.. ఫైనలిస్ట్‌లను సన్మానించి, మిస్ యూనివర్స్ కంటెస్టెంట్లు వారి ప్రయాణంలో విజయం సాధించాలని కోరారు. ఇక, జూన్ 7వ తేదీ, హైదరాబాద్‌లోని ఆజీజ్‌నగర్, ధారా రిసార్ట్, కన్వెన్షన్‌లో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో ఈ ఫైనలిస్ట్‌లు పోటీ పడనున్నారు.



## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్..

# తెలంగాణకు చెందిన మావోయిస్టు నేత మృతి

చర్ల: చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌జిల్లాలో నేషనల్ పార్క్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు నేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందారు. అతడి స్వస్థలం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచరా. భాస్కర్‌పై రూ. 25లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలిలో ఏకే47ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.

## ఈ ఏడాది ఖైరతాబాద్‌లో

# శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి.. ఘనంగా తొలిపూజ






హైదరాబాద్: ఖైరతాబాద్ మహా గణపతి ఈ ఏడాది శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఖైరతాబాద్‌లో జరిగే మహాగణపతి 71వ వేడుకలకు శుక్రవారం నిర్జల ఏకాదశి సందర్భంగా కర్ర పూజ (తొలిపూజ) జరిగింది. ఈ సందర్భంగా ఈ ఏడాది రూపుదిద్దుకోనున్న విగ్రహ నమూనా చిత్రాన్ని విడుదల చేశారు. ఈసారి 69 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి కేటీఆర్‌కు

# సుప్రీంకోర్టు నోటీసులు..

దిల్లీ: మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల అవినీతికి పాల్పడిందని గతంలో కేటీఆర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ ఫిర్యాదుతో ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. కేసుని సవాల్ చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ఆయనకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆత్రం సుగుణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.

## రాజేంద్రనగర్‌లో వృద్ధ దంపతుల దారుణహత్య..

# నిందితుల కోసం ప్రత్యేకబృందాలు



హైదరాబాద్: రాజేంద్రనగర్‌లో వృద్ధ దంపతుల హత్య కలకలం రేపింది. జనచైతన్య ఫేజ్ 2లో నివసించే షేక్ అబ్దుల్లా, అతని భార్య రిజ్వానా దారుణ హత్యకు గురయ్యారు. ఇద్దరినీ గొంతు కోసి దుండగులు హతమార్చారు. గురువారం సాయంత్రమే ఈ ఘటన జరగ్గా.. శుక్రవారం వెలుగు చూసింది. కేసు వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. షేక్ అబ్దుల్లా ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి కాగా ఆయన భార్య రిజ్వానా విశ్రాంత లెక్చరర్. జనచైతన్య ఫేజ్ 2 సొంతిల్లు నిర్మించుకొని 40 రోజుల క్రితమే అందులోకి వచ్చారు. నిన్న సాయంత్రం వీరి ఇంటికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒక వ్యక్తి మాస్క్, క్యాప్ పెట్టుకోగా, మరో వ్యక్తి బురఖా ధరించి ఉన్నాడు. మాస్క్ పెట్టుకున్న వ్యక్తి వాచ్‌మెన్‌తో మాట్లాడి.. ఫిజియోథెరపీ చేసేందుకు వచ్చామని చెప్పాడు. ఇద్దరూ.. వృద్ధ దంపతులు నివసించే పైఅంతస్తులోకి వెళ్లారు. 40 నిమిషాల తర్వాత ఒకరు కిందకు వచ్చారు. అరగంటలో మరో వ్యక్తి కిందకు వచ్చాడు. నిందితులు వారి వెంట తెచ్చుకున్న కత్తితో దంపతులపై విచక్షణారహితంగా దాడి చేశారు. అబ్దుల్లా ఒంటిపై 7 కత్తిపోట్లు, రిజ్వానా ఛాతిపై కత్తిపోటు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వృద్ధ దంపతులను దోపిడీ దొంగలు డబ్బు, బంగారం కోసం హతమార్చారా?ఆస్తి తగాదాల నేపథ్యంలో బంధువులే హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు రాజేంద్రనగర్ డీసీపీ తెలిపారు. సీసీ ఫుటేజ్, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. అబ్దుల్లా, రిజ్వానా దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు అమెరికాలో, మరో ఇద్దరు లండన్‌లో ఉంటున్నట్టు సమాచారం.

## హైదరాబాద్‌లోని

# పలు ప్రాంతాల్లో భారీ వర్షం



హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వాహనదారులు తడిసిముద్దయ్యారు. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి ఎండవేడిమితో అల్లాడిన నగరవాసులు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

# తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం

**: మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్: బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు. ‘‘ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని.. వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వరకైనా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారు’’ అని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

# బెంగళూరు తొక్కిసలాట ఘటన.. మమ్మల్ని బలిపశువుని చేస్తారా?: కేఎస్‌సీఏ

బెంగళూరు: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయాన్ని పురస్కరించుకొని నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటతో తమకు ఎలాంటి సంబంధం లేదని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (KSCA) తెలిపింది. ఇది కేవలం కర్ణాటక ప్రభుత్వం, ఆర్సీబీ యాజమాన్యం, ఈవెంట్ నిర్వాహకుల తీరు వల్లే జరిగిందని పేర్కొంది. ఫ్యాన్స్‌ను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారని, వారు చేసిన పొరపాటుకు కేఎస్‌సీఏని బలిపశువును చేయడం తగదని విమర్శించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. ''ఆర్సీబీ జట్టు విజయోత్సవ ర్యాలీతో కేఎస్‌సీఏకి ఎలాంటి సంబంధం లేదు. ఆటగాళ్లను సత్కరించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. అది కూడా చిన్నస్వామి స్టేడియంలో జరగలేదు. విధాన సౌధ వద్ద జరిగింది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, క్యాబినెట్ మంత్రులు, సీనియర్ పోలీసు అధికారులు సైతం హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఉన్నతాధికారులు అనుమతులిచ్చారు. అందులో కేఎస్‌సీఏ జోక్యం ఏమాత్రం లేదు. కేవలం వేదికను అద్దెకివ్వడం, క్రికెట్ సంబంధిత వ్యవహారాల వరకే అసోసియేషన్ బాధ్యత వహిస్తుంది'' అని కేఎస్‌సీఏ ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటనకు కారకులుగా భావిస్తూ కబ్బన్ పార్క్ పోలీసులు ఆర్సీబీ, ఈవెంట్ నిర్వాహక సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, కేఎస్‌సీఏపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఈ ఘటనలతో



సంబంధం లేదని, ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ కర్ణాటక హైకోర్టులో ఇంతకుముందే రిట్ పిటిషన్ దాఖలు చేసింది. కేవలం పోలీసుల నిర్లక్ష్యం వల్లే 11 మంది ప్రాణాలు పోయాయని, అందుకు బాధ్యత వహించకుండా క్రికెట్ అసోసియేషన్‌ను బలిపశువును చేయడం సరికాదని కేఎస్‌సీఏ పేర్కొంది. తప్పు చేయని వారిపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించలేరని తెలిపింది. బుధవారం సాయంత్రం చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను సుమోటోగా తీసుకున్న కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించటంలో వైఫల్యం ఎవరిదో తేల్చిచెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే కోర్టు సూచన మేరకు తొక్కిసలాట ఘటన దర్యాప్తునకు సీఐడీ పోలీసులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

*** కేఎస్‌సీఏపై బలవంతపు చర్యలొద్దు: హైకోర్టు**

బెంగళూరు తొక్కిసలాట ఘటనకు సంబంధించి కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌పై ఎలాంటి బలవంతపు చర్యలకు పాల్పడవద్దని కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్సీబీ యాజమాన్యం, ఈవెంట్ ఆర్గనైజర్ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్‌తోపాటు కేఎస్‌సీఏ పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేఎస్‌సీఏ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## దిల్లీ సీఎంకు బెదిరింపులు.. భద్రత పెంపు

ఘజియాబాద్: దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తానంటూ ఓ దుండగుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. ఘజియాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన దిల్లీ పోలీసులు.. ఆమెకు మరింత భద్రతను పెంచారు. కాల్ చేసిన దుండగుడు వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని ఘజియాబాద్ డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు. ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఆ సమాచారాన్ని దిల్లీ పోలీసులు, ముఖ్యమంత్రి భద్రతాధికారులకు




చేరవేసినట్లు తెలిపారు. సంబంధిత సిమ్ కార్డు ఓ మహిళ పేరిట ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ ధ్రువపత్రాలతో ఆ సిమ్ కార్డు కొనుగోలు చేసినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మోదీజీ.. నాకు ప్రమోషన్ ఎప్పుడు?: ప్రధానిని అడిగిన సీఎం

ప్రధాని మోదీ తనను త్వరలో ప్రమోట్ చేస్తారని ఆశిస్తున్నట్లు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. శుక్రవారం జమ్మూకశ్మీర్ పర్యటనకు వెళ్లిన మోదీ వద్ద ఆయన రాష్ట్ర హోదా అంశాన్ని ప్రస్తావించారు. ఆ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సీఎంగా ఉన్నాను. నేను ఇప్పుడు ఒక కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి.. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ వచ్చింది. త్వరలో నాకు ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నా. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నాను'' అని ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ ఎల్‌జీగా మనోజ్ సిన్హా ఉన్నారు. జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి



2014 వరకు ఒమర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో పాటు జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మారుస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్‌కు గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను డిమాండ్ చేయబోనని ఆయన వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ''పహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రహోదాను డిమాండ్ చేయాలి. నావి అంత చౌకబారు రాజకీయాలు కావు. గతంలో రాష్ట్ర హోదా అడిగాం.. భవిష్యత్తులో కూడా అడుగుతాం. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు'' అని గతంలో వ్యాఖ్యానించారు. తాజాగా చినాబ్ వంతెన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ఎదుట మళ్లీ తన డిమాండ్ వినిపించారు.

## కన్నడ భాషపై వివాదం.. మోహన్‌దాస్ పాయ్ కీలక వ్యాఖ్యలు!

కర్ణాటకలో పనిచేసే ఉద్యోగులు స్థానిక భాష నేర్చుకోవాలని, ప్రజా సంబంధిత వ్యవహారాల్లో దాన్ని ఉపయోగించాలని ప్రముఖ టెక్ ఇన్వెస్టర్, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ సూచించారు. కన్నడ నేర్చుకోవడానికి కొందరు అధికారులు అహంకారంగా నిరాకరించడమే వివాదాలకు కారణమవుతుందని తెలిపారు. వీటిని నివారించేందుకు కన్నడ నేర్చుకోవాలని సూచించారు. భాషా వివాదం కొనసాగుతున్న వేళ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''బెంగళూరుకు నిత్యం భారీ సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. స్థానికంగా కన్నడ మాట్లాడేవారు కేవలం 33 శాతం మంది మాత్రమే. బయటి నుంచి వచ్చిన వారు ఇక్కడ బాగానే స్థిరపడ్డారు. కానీ, కొందరు అహంకారంతో కొన్ని కన్నడ పదాలు మాట్లాడడానికి కూడా నిరాకరిస్తున్నారు. కొన్ని పదాలైనా నేర్చుకొని మాట్లాడుతూ స్థానికులకు గౌరవం ఇవ్వాలి. అది మన బాధ్యత'' అని మోహన్‌దాస్ పాయ్ అన్నారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి



వ్యవహారంపై ఈ సందర్భంగా మోహన్‌దాస్ పాయ్ స్పందించారు. ఒక బ్యాంక్ మేనేజర్ కస్టమర్‌తో కన్నడలో మాట్లాడడానికి నిరాకరించడం ప్రజల ఆగ్రహానికి గురిచేసిందన్నారు. చివరకు బ్యాంక్ నుంచి అధికారిక క్షమాపణ చెప్పాల్సి వచ్చిందని గుర్తు చేశారు. 'సార్!, నాకు భాష రాదు.. నేర్చుకుంటున్నా.. నా సహోద్యోగి సాయం తీసుకుంటాను' అని గౌరవంగా బదులు చెప్పి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కస్టమర్ సేవల్లో ఉన్నవారు అక్కడి భాష, సంస్కృతిని గౌరవించాలన్నారు. కస్టమర్‌కు హిందీ, ఇంగ్లీష్ రాని పక్షంలో ఉద్యోగులే స్థానిక భాష తప్పనిసరిగా మాట్లాడగలిగేలా ఉండాలన్నారు.

## ఆగస్టు 3న నీట్ పీజీ పరీక్ష.. నిర్వహణకు సుప్రీంకోర్టు అనుమతి

నీట్ పీజీ25 ప్రవేశ పరీక్షను ఆగస్టు 3న నిర్వహించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డ్ ఈ కొత్త తేదీని ప్రతిపాదించగా.. అత్యున్నత న్యాయస్థానం తాజాగా ఓకే చెప్పింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల కోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్‌ఈబీ అభ్యర్థన మేరకు పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని



కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కూ ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది. నీట్‌పీజీ 2025ని రెండు షిఫ్ట్‌లలో నిర్వహిస్తారంటూ వెలువడిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినందున దేశమంతటికీ ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించడం కష్టం కాబోదని చెబుతూ అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చింది. పరీక్ష నిర్వహణకు ఇంకా రెండు వారాలకు పైగా సమయం ఉన్నందున సురక్షితమైన పరీక్షా కేంద్రాల ఎంపిక కష్టమేమీ కాదని స్పష్టంచేసింది. ఏర్పాట్లకు సమయం సరిపోదని అధికారులు భావిస్తే పరీక్ష తేదీని పొడిగించుకొనే స్వేచ్ఛనిస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తేదీ మార్పు చోటుచేసుకుంది.

## ఎట్టకేలకు దిల్లీ సీఎంకు అధికారిక నివాసం కేటాయింపు

దిల్లీ సీఎం రేఖా గుప్తాకు అధికారిక నివాసాన్ని గుర్తించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి దాదాపు 100 రోజుల తర్వాత ఆమెకు కొత్త బంగ్లాను కేటాయించారు. ఇది ఆమె నియోజక వర్గానికి దగ్గరగా ఉన్న సివిల్ లైన్స్‌లోని రాజ్ నివాస్ మార్గంలో ఓ బంగ్లా. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్‌కు, సాంఘిక సంక్షేమ మంత్రి రవీంద్ర ఇంద్రరాజ్‌లకు కూడా ఇక్కడే బంగ్లాలు కేటాయించారు. గతంలో ఆప్ నేత మనీశ్ సిసోదియా ఉన్న మధుర రోడ్డులోని ఇంటిని పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ ఇకపై ఉపయోగించనున్నారు. భాజపా ప్రభుత్వంలోని కొత్త ఎంపీలందరికీ ఇప్పటికే కొత్త నివాసాలను కేటాయించారు. సీఎం ప్రస్తుతం షాలిమార్ బాగ్‌లోని తన నివాసం నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో అక్కడికి వచ్చే సందర్శకులు, వీఐపీలు, సీనియర్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక సచివాలయానికి వెళ్లేందుకు రోజూ 25 కిలోమీటర్లు ఆమె ప్రయాణించాల్సి వస్తోంది.

## రాజ్యసభకు కమల్ హాసన్ నామినేషన్



మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి తమిళనాడు సీఎం ఎంకే. స్టాలిన్, మంత్రి ఉదయ నిధి స్టాలిన్ హాజరయ్యారు. ఇటీవల తన చిత్రం 'థగ్ లైఫ్' ఈవెంట్‌లో కన్నడ భాషపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దాంతో బుధవారం వేయాల్సిన రాజ్యసభ నామినేషన్‌ను కమల్ వాయిదా వేసుకున్నారు. సినిమా వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. థగ్ లైఫ్ చిత్రం గురువారం విడుదలవడంతో నేడు నామినేషన్ దాఖలు చేశారు. కమల్‌తో పాటు మరో ముగ్గురు డీఎంకే నేతలు రాజ్యసభకు నామినేషన్ వేశారు. కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించింది. ఇందుకుగాను చేసుకున్న ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. దీంతో 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు.

# ఆర్బీఐ ప్రకటనతో మార్కెట్లో జోష్..

25 వేల ఎగువన ముగిసిన నిఫ్టీ

ఆర్బీఐ రెపో రేటు 0.50%, సీఆర్ఆర్ 1.00% తగ్గింపు

సెన్సెక్స్ 746 పాయింట్లు, నిఫ్టీ 252 పాయింట్లు జంప్

నిఫ్టీ బ్యాంక్ సూచీ ఆల్ టైమ్ హైకి చేరిక

బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్లు

మార్కెట్ సానుకూలత కొనసాగుతుందని నిపుణుల అంచనా

దిగివచ్చినప్పుడల్లా కొనుగోలు చేయొచ్చని సూచన




**ముంబై:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) తీసుకున్న కీలక నిర్ణయాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాల్లో ముగిశాయి. రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.50 శాతానికి, నగదు నిల్వల నిష్పత్తిని (సీఆర్ఆర్) నాలుగు విడతల్లో 100 బేసిస్ పాయింట్లు తగ్గించాలని ఆర్బీఐ ప్రకటించడమే ఈ ఉత్సాహానికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ సానుకూల పరిణామంతో సూచీలు పరుగులు పెట్టాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 746.95 పాయింట్లు (0.92 శాతం) లాభపడి 82,188.99 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 252.15 పాయింట్లు (1.02 శాతం) వృద్ధి చెంది 25,003.05 వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగ షేర్లు ఈ ర్యాలీకి నాయకత్వం వహించాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 817.55 పాయింట్లు (1.47 శాతం) పెరిగి 56,578.40 వద్ద క్లోజ్ అయింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో నిఫ్టీ బ్యాంక్ 56,695 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఇది ఈ ప్రధాన బ్యాంకింగ్ సూచీకి ఇప్పటివరకూ అత్యధిక స్థాయి కావడం విశేషం.

లార్జ్‌క్యాప్ షేర్లతో పాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో కూడా కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 707.30 పాయింట్లు (1.21 శాతం) లాభపడి 59,010.30 వద్ద, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 149.85 పాయింట్లు (0.81 శాతం) పెరిగి 18,582.45 వద్ద ముగిశాయి.

ఆర్బీఐ తీసుకున్న ఈ "బజూకా పాలసీ" (అత్యంత ప్రభావవంతమైన విధానపరమైన చర్య) కారణంగా స్టాక్ సూచీలు వేగంగా పుంజుకున్నాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన రూపక్ దే తెలిపారు. "చాలా సెషన్ల తర్వాత నిఫ్టీ 25,000 మార్కు పైన ముగియడం మార్కెట్ వర్గాల్లో పెరిగిన ఆశావాదానికి సూచన. సాధారణంగా, ఒక ర్యాలీ తర్వాత మార్కెట్ కొంత స్థిరీకరణకు లోనై, ఆపై పైకి దూసుకుపోతుంది. ఈసారి కూడా నిఫ్టీ ఇటీవలి కన్సాలిడేషన్ పరిధిని ఛేదించుకుని పైకి వెళ్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

వడ్డీ రేట్లలో భారీ కోత, సీఆర్ఆర్ తగ్గింపు ద్వారా ద్రవ్య లభ్యతను పెంచడం వంటి చర్యలు, తగ్గిన వడ్డీ రేట్ల ప్రయోజనాలను వేగంగా బదిలీ చేయడానికి వీలు కల్పిస్తాయని, ఆర్థిక వృద్ధి, పెట్టుబడులు, వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఆర్బీఐ దృఢ నిబద్ధతను ఇది బలపరుస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ వంటి వడ్డీ రేట్లకు సున్నితంగా స్పందించే రంగాలు ఈ ర్యాలీలో ముందున్నాయని వారు తెలిపారు.

రాబోయే రోజుల్లో కూడా వడ్డీ రేట్ల కోత ప్రభావం మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తుందని అంచనా వేస్తున్నారు. "వడ్డీ రేట్లకు సున్నితంగా ఉండే రంగాలతో పాటు, రైల్వేస్ వంటి ఎంపిక చేసిన థీమ్‌లు దృష్టిలో ఉంటాయి. ఇతర రంగాలు రొటేషన్ పద్ధతిలో దోహదపడవచ్చు. ఎంపిక చేసిన స్టాక్స్‌పై దృష్టి సారిస్తూ, మార్కెట్ తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహాన్ని (బై ఆన్ డిప్స్) మేము సిఫార్సు చేస్తున్నాము" అని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్‌కు చెందిన అజిత్ మిశ్రా వివరించారు.

## స్టన్నింగ్ ఫీచర్స్‌తో హ్యుందాయ్ కారు

# నయా వెర్షన్..

**న్యూఢిల్లీ:** హ్యుందాయ్ కొత్త ఎస్ఎక్స్ ప్లస్ వేరియంట్ రిలీజ్ చేయడం ద్వారా వెర్నా సెడాన్ శ్రేణిని విస్తరించిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొత్త వేరియంట్ ధర రూ. 13.79 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. ఈ కారు 115 హెచ్‌పీ, 144 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేసే 1.5 లీటర్ పెట్రోల్ మోటారుతో మాత్రమే అందుబాటులో ఉంటుంది. ట్రాన్స్మిషన్ ఎంపికలలో ఎంటీ, ఐవీటీ రెండూ ఉన్నాయి. ఐవీటీ వెర్షన్ ధర రూ. 15.04 లక్షల వరకు ఉంటుంది.




వెర్నా ఎస్ఎక్స్ం కారులో వెంటిలేటెడ్, హీటెడ్ ఫ్రంట్ సీట్లు, లెథరెట్ అలరీ, 8-స్పీకర్ బోస్ సౌండ్ సిస్టమ్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్లు ఉన్నాయి. ఎక్స్‌టీరియర్ విషయానికి వస్తే ఎల్ఈడీ హెడ్ ల్యాంప్లు ఆకట్టుకుంటున్నాయి. ఎస్ఎక్స్ ప్లస్ ట్రిమ్ ఇంటీరియర్‌లో 8.0-అంగుళాల ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, డిజిటల్ డ్రైవర్ డిస్ప్లే వంటి లక్షణాలు ఆకట్టుకుంటాయి. ఈ సిస్టమ్ వైర్లెస్ ఆపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటోలకు సపోర్ట్ చేస్తుంది. మైలేజ్ విషయానికి మాన్యువల్ వేరియంట్ 18.6 కిలోమీటర్లు మైలేజ్ ఇస్తుంది. అయితే ఐవీటీ వేరియంట్ 19.6 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది.

కొత్త వెర్నా వేరియంట్‌తో పాటు హ్యుందాయ్ వైర్డ్-టు-వైర్లెస్ అడాప్టర్ అనే కొత్త యాక్సెసరీని కూడా విడుదల చేసింది. ఈ అడాప్టర్ ధర రూ. 4,500. అలాగే వెర్నా, గ్రాండ్ ఐ10 నియోస్, ఎకర్, ఆరా, వెన్యూ, వెన్యూ ఎన్ లైన్, అల్కాజార్ వంటి అనేక మోడళ్లకు వైర్లెస్ ఆపిల్ కార్ ప్లే మరియు ఆండ్రాయిడ్ ఆటో ప్లేను అనుమతిస్తుంది. అలాగే మే 2025లో మొత్తం 58,701 హ్యుందాయ్ యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశీయ మార్కెట్ 43,861 యూనిట్లు అమ్ముడైతే విదేశీ మార్కెట్లకు 14,840 యూనిట్లు రవాణా చేశారు.

## సంబరాలతో జనాల ప్రాణాలు తీయడం

# సరికాదు

### టీమిండియా మాజీ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్



బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) విజయోత్సవ సంబరాల్లో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనపై టీమిండియా మాజీ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఘాటుగా స్పందించాడు. విజయోత్సవాలతో జనాల ప్రాణాలు తీయడం సరికాదన్నాడు. క్రీడా విజయాలను ఉత్సవంగా జరపడానికి రోడ్ షోలు అవసరం లేదని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి గంభీర్ గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా తొక్కిసలాట ఘటనపై మాట్లాడుతూ.. భవిష్యత్తులోనైనా ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పాడు.

'విజయోత్సవ వేడుకల కంటే జనాల ప్రాణాలు ముఖ్యం. ఇక ముందైనా మనం జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి రోడ్ షోలు చేయవద్దు. క్రీడా విజయాలను ఉత్సవంగా జరపడానికి రోడ్ షోలు అవసరం లేదు.'అని గంభీర్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉంటాడని గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అతన్ని అన్ని మ్యాచ్‌లు ఆడించలేమని చెప్పాడు. బుమ్రా గైర్హాజరీలోనూ రాణించే పేస్ విభాగం భారత్‌కు ఉందని తెలిపాడు.'ఏ మూడు మ్యాచ్‌ల్లో బుమ్రాను ఆడించాలనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అతను ఎన్ని మ్యాచ్‌లు ఆడుతాడనేది కూడా ఇంకా ఖరారు కాలేదు. బుమ్రా స్థానాన్ని భర్తీ చేయడం ఎప్పుడైనా కష్టమే. కానీ మా బౌలింగ్ విభాగంలో బుమ్రాను భర్తీ చేసే క్వాలిటీ బౌలర్లు ఉన్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత కూడా నేను ఒత్తిడిలో ఉన్నా. ఎందుకంటే కోచ్‌గా ఎప్పుడూ మంచి ఫలితాలు రావాలని నేను కోరుకుంటా. ప్రతీ మ్యాచ్‌లోనూ జట్టు నెగ్గాలని భావిస్తా. కరుణ్ నాయర్ కౌంటీ క్రికెట్ అనుభవం, అతని ఫామ్ టీమిండియాకు ఉపయోగపడుతుంది.'అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

# స్పిన్నర్ పీయూశ్ చావ్లా రిటైర్మెంట్

**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా సీనియర్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తాను అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు శుక్రవారం ప్రకటించాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఇన్‌స్టాలో ప్రకటిస్తూ పోస్ట్ షేర్ చేశాడు. కెరీర్‌లో తనకు సహాయ సహకారాలు అందించిన కుటుంబ క్రికెట్‌లో పీయూశ్ ఆఖరి మ్యాచ్ ఆడి దశాబ్దం దాటింది. 2012 డిసెంబర్?లో ఇంగ్లాండ్‌పై లాస్ట్ మ్యాచ్ అడాడు. టెస్టుల్లో 7, వన్డేల్లో 32, టీ20ల్లో 4 వికెట్లు కూల్చాడు.అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించలేకపోయినా, ఫ్రాంఛైజీ క్రికెట్‌లో పీయూష్ చావ్లా సత్తా చాటుకున్నాడు. ఐపీఎల్ మాత్రం అదరగొట్టాడు.




సభ్యులు, ఐపీఎల్ ఫ్రాంఛైజీలు, అభిమానులకు ఈ సందర్భంగా థాంక్స్ చెప్పాడు.కాగా, 36ఏళ్ల పీయూష్ 2007 టీ20 ప్రపంచ కప్, 2011 వన్డే వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడు. భారత్ తరఫున మూడు టెస్టులు, 25 వన్డేలు, 7 టీ20లు ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువగా అవకాశాలు దక్కలేదు. అంతర్జాతీయ కోల్‌కతా నైట్‌రైడర్స్, ముంబయి ఇండియన్స్ జట్ల తరఫున ఆడాడు. కెరీర్‌లో 192 మ్యాచ్‌ల్లో 192 వికెట్లు పడగొట్టాడు. అలాగే 446 ఫస్ట్ క్లాస్ వికెట్లు, 319 టీ20 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో పలు టీమ్‌ల తరఫున ఆడాడు. 2012, 2014లో ఐపీఎల్ టైటిల్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

# తొక్కిసలాట ఘటన..

### హైకోర్టును ఆశ్రయించిన కర్ణాటక క్రికెట్ సంఘం



**బెంగళూరు:** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందడం యావత్ జాతిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ దుర్ఘటనపై నెటిజన్లు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాకట క్రికెట్ అసోసియేషన్, ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో తమపై దాఖలైన కేసును సవాల్ చేస్తూ కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది .

కేఎస్‌సీఏ అధ్యక్షుడు రఘురామ్ భట్, కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఈఎస్ జయరాం సంయుక్తంగా కర్ణాటక హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. తమపై నమోదైన కేసును కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వీరి పిటిషన్‌పై ఇవాళ మధ్యాహ్నం విచారణ జరగనున్నట్లు తెలుస్తోంది.

# జామీ ఒవర్టన్ రీ ఎంట్రీ

### టీమిండియాతో టెస్ట్ సిరీస్‌కు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన



**లండన్:** టీమిండియాతో ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుకు 14 మందితో కూడిన బృందాన్ని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ జట్టులో పలువురు ఆటగాళ్లు రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ముఖ్యంగా జామీ ఒవర్టన్ గాయం నుంచి కోలుకుని ఈ టెస్టుకు అందుబాటులో ఉంటున్నాడు. అలాగే ఇటీవలే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో దుమ్ము రేపిన జాకబ్ బెతెల్ కూడా పిలుపు వచ్చింది. వీరి రాకతో ప్లేయింగ్ లెవన్ ఎంపికపై టీమ్ మేనేజ్మెంట్ లో చిన్నగా తలనొప్పి మొదలైంది. వైట్ బాల్ క్రికెట్ లో రెగ్యులర్ ఆటగాడైన ఓవర్టన్ 2022లో న్యూజిలాండ్ పై అరంగేట్రం చేశాడు. ఆ టెస్టులో రెండు వికెట్లతో పాటు 97 పరుగులు చేసి, తాను ఆల్ రౌండర్ నని ఘనంగా చాటాడు. అయితే తొలి టెస్టుకు తను ఫుల్ ఫిట్ నెస్ తో ఉన్నాడా..? లేదా అనే విషయంపై స్పష్టత లేదు. ఇటీవల వెస్టిండీస్ తో జరిగిన మూడు వన్డేల సిరీస్ లో తను చేతిలేలి గాయంతో బాధపడ్డాడు. దాని నుంచి ఎప్పుడు కోలుకుని ఫుల్ ఫిట్ గా అవుతాడో క్లారిటీ లేదు. ప్రస్తుతం అతని పరిస్థితిని మెడికల్ టీమ్ అబ్జర్వ్ చేస్తున్నట్లు క్రికెట్ బోర్డు తెలిపింది. ఇక కౌంటీల్లో తనతోపాటే ఆడే మరో పేసర్ గస్ అట్కిన్సన్ ఈ స్క్వాడ్ లోకి గాయం కారణంగా ఎంపికవలేదు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన ఏకైక టటెస్టులో తను తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నాడు. భారత్ తో మ్యాచ్ కు మరో ఇద్దరు పేసర్లకు చోటు కల్పించారు. క్రిస్ వోక్స్ తోపాటు బ్రైడెన్ కార్స్ ను జట్టులోకి ఎంపిక చేశారు. అనుభవం కల వోక్స్.. మంచి బౌలింగ్ తో పాటు బ్యాటింగ్ కూడా చేయగలడు. ఇక కార్స్ కూడా ఆల్ రౌండర్ గా ఇప్పుడిప్పుడే నిరూపించుకుంటున్నాడు. ఇక వోక్స్ రాకతో శామ్ కుక్ డగౌట్ కే పరిమితమయ్యే అవకాశముంది. మరో ఎండ్ లో బెతెల్ రాకతో టాపార్డర్ లో ఒలీ పోప్, ఓపెనర్ జాక్ క్రాలీ స్థానాలకు ముప్పు ఎదురయ్యే అవకాశముంది. తను న్యూజిలాండ్ పై అరంగేట్రం చేసి 52కిపైగా సగటుతో మూడు అర్థ సెంచరీలు సాధించాడు. అయితే ఇటీవలే జరిగిన జింబాబ్వేపై టెస్టులో ఈ ఇద్దరు సెంచరీలు చేయడం ఊరట. అనుభవానికి పెద్ద పీట వేస్తే, ఈ ఇద్దరికే తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. ఇక ఐదు టెస్టుల సిరీస్ లో భాగంగా తొలి మ్యాచ్ హెడీంగ్లీతో జరుగనున్న సంగతి తెలిసిందే.

**భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు**

**స్క్వాడ్:** బెన్ స్టోక్స్ (కెప్టెన్), షోయబ్ బషీర్, జేకబ్ బెథెల్, హ్యారీ బ్రుక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జాక్ క్రాలీ, బెన్ డకెట్, జేమీ ఓవర్టన్, ఓల్లి పోప్, జో రూట్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), జాష్ టంగ్, క్రిస్ వోక్స్.

# మైత్రీ మూవీ మేకర్స్ '8 వసంతాలు' నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్



**టాకీస్:** టాలీవుడ్ యువ దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం '8 వసంతాలు'. దాదాపు 7 సంవత్సరాల తర్వాత మెగాఫోన్ పట్టిన ఈ దర్శకుడు ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. '8 వసంతాలు'. సినిమాను టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవి శంకర్ నిర్మిస్తుండగా.. ఈ సినిమాలో మ్యాడ్ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న అనంతిక సనీల్ కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా మరో అప్‌డేట్‌ను పంచుకుంది.

ఈ సినిమా నుంచి 2వ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. జూన్ 7న మధ్యాహ్నం 3:33 గంటలకు ఈ మూవీ నుంచి రెండవ టీజర్‌ను పంచుకోబోతున్నట్లు మైత్రీ ప్రకటించింది. ఇక ఈ సినిమాను జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రంలో అనంతిక సనీల్ కుమార్ శుద్ధి అయోధ్య అనే మార్షల్ ఆర్ట్స్ యోధురాలిగా కనిపించబోతుంది.

ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే.. 365 రోజులని అంకెలతో కొలిస్తే ఒక సంవత్సరం అదే అనుభవాలతో కొలిస్తే ఒక వసంతం. 8 వసంతాలు అంటే '8 స్ప్రింగ్స్' ఇది 8 సంవత్సరాల కాలంలో కాలక్రమానుసారంగా సాగే కథనం, ఒక అందమైన యువతి జీవితంలోని ఒడిదుడుకులు, ఆసక్తికరమైన ప్రయాణాన్ని ఎక్స్ ఫ్లోర్ చేయనుంది.

# రామాయణ్ కోసం కష్టపడుతున్న రణ్‌బీర్



**టాకీస్:** యానిమల్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్ 'రామాయణ్' కోసం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దంగల్ దర్శకుడు నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం రణబీర్ ఇప్పటికే చాలా కష్టపడుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడి పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. దీనికోసం రణ్‌బీర్ క్లీన్ షేవ్‌తో దర్శనమిచ్చాడు. సంజయ్ లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' సినిమా కోసం మీసాలతో కనిపించిన రణ్‌బీర్ తాజాగా రామాయణ్ కోసం క్లీన్ షేవ్‌లో కనిపించడంతో ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో సౌత్ స్టార్ యష్ రావణుడుగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ముంబైలోని ఫిలింసిటీలో 'రామాయణ్' కీలక సన్నివేశాల షూటింగ్ జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో సన్నీ డియోల్ హనుమాన్‌గా, లారా దత్తా కైకేయిగా, అరుణ్ గోవిల్ దశరథుడిగా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే, కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో నటించనున్నట్లు సమాచారం.

# వైవాహిక బంధంలోకి నటుడు అఖిల్

## 8న అన్నపూర్ణలో వివాహ విందు



**టాకీస్:** తన బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేశారు నటుడు అఖిల్ అక్కినేని. శుక్రవారం తెల్లవారుజామున ఆయన వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియురాలు జైనబ్ రవ్జీతో ఆయన వివాహం వేడుకగా జరిగింది. హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు, చిరంజీవి కుటుంబం, రాజమౌళి తనయుడు కార్తికేయ, దర్శకుడు ప్రశాంత్ నీల్, నటుడు శర్వానంద్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

దీనికి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. జూన్ 8న రిసెప్షన్ జరగనుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న ఈ వివాహ విందుకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. ఢిల్లీకి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కూడా. ఇండియాలోనే కాదు దుబాయ్, లండన్‌లోనూ ఆర్టిస్ట్‌గా ఆమె రాణించారు. రెండేళ్ల క్రితం అఖిల్‌తో మొదలైన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో ఒక్కటయ్యారు. జైనబ్ తండ్రి జుల్ఫీ రవ్జీ, నాగార్జున కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్నేహబంధం ఉంది. అంతకుముందు అఖిల్ ఎంగేజ్మెంట్ జరిగినా పెళ్లి దగ్గర ఆగిపోయింది.



# హాలీవుడ్ పిలుస్తోందంటున్న దిశా పటానీ..

**టాకీస్:** బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ ఈ మధ్య ఏం అనుకుంటే అది జరుగుతోంది. సౌత్, నార్త్ కంప్లీట్ అయిందంటూ ఇప్పుడు సరిహద్దులు చెరిపేసి హాలీవుడ్‌ని ఎయిమ్ చేస్తున్నారు. కల్కి సినిమాలో హీరో భైరవ. అతని లవ్ ఇంట్రస్ట్ రాక్సీ. ఈ రోల్ చేసింది దిశా పటానీ. కథ పరంగా పెద్దగా ఇంపార్టెన్స్ లేదు. కొన్ని సీన్లు, ఓ సాంగ్‌కి మాత్రమే పరిమితమయ్యారు దిశా. అయినా సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో దిశతో డార్లింగ్ ఆడిపాడిన సాంగ్‌కి మంచి క్రేజ్ వచ్చింది. నెక్స్ట్ పార్ట్ 2లో వీరిద్దరి స్క్రీన్ ప్రెజెన్స్ ఇంకొంచెం ఎక్కువే ఉండొచ్చనే మాటలూ వినిపిస్తున్నాయి. కల్కి తర్వాత కంగువ మీద కూడా బిగ్ హోప్స్ పెట్టుకున్నారు దిశ. కానీ సూర్యతో నటించిన కంగువ ఈ అమ్మణికి కలిసి రాలేదు. సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. కంగువ అనుకున్నంత సక్సెస్ అయి ఉంటే తప్పకుండా సీక్వెల్ ఉండేది. సౌత్‌లో దిశకు మరో ప్రాజెక్ట్ ఉండేది. కల్కి సీక్వెల్ స్టార్ట్ అయ్యేవరకు బాలీవుడ్ ప్రాజెక్టులతో బిజీ కావాలన్నది దిశ ప్లాన్. ప్రస్తుతం బాలీవుడ్‌లో వెల్కమ్ టు ద జంగిల్ చేస్తున్నారు దిశ. ఈ సినిమా తర్వాత మాత్రం మరే ప్రాజెక్టులకూ సైన్ చేయలేదు. సమ్‌థింగ్ బిగ్ అంటూ ఊరించారు.ఆ బిగ్ న్యూస్ ఇప్పుడు రివీల్ అయింది. బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ హాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతున్నారు. ది యూజువల్ సస్పెక్ట్, హౌస్ ఆఫ్ కార్డ్స్ లాంటి సినిమాలతో ప్రూవ్ చేసుకున్న ఆస్కార్ విన్నర్ కెవిన్ స్పేసీ నెక్స్ట్ మూవీలో కీలక పాత్రలో నటించబోతున్నారు దిశా. హొలీ గార్డ్స్ పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం 20 ఏళ్ల తరువాత మెగా ఫోన్ పడుతున్నారు కెవిన్.

# అమితాబ్ సినిమాలే మన హీరోలను నిలబెట్టాయ్

## ఆనాటి తెలుగు రీమేక్‌లపై ఆర్జీవీ సంచలన కామెంట్స్

**టాకీస్:** ఆర్జీవీ ఎప్పటికప్పుడు ఏదో ఒక సంచలన కామెంట్స్ చేస్తూనే ఉంటారు. అది ఎంత పెద్ద వివాదం అయినా ఆయన పెద్దగా పట్టించుకోరు. మరోసారి అలాంటి కామెంట్స్ చేశారు. తాజాగా ఆయన ఓ పాడ్ కాస్ట్ ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు. ఇందులో మాట్లాడుతూ.. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీ పడిపోయింది. మన సినిమాలను వాళ్లు కాపీ కొడుతున్నారు. కానీ ఒకప్పుడు బిగ్ బీ సినిమాలే మన సౌత్‌కు స్ఫూర్తిగా ఉండేవి. అమితాబ్ బచ్చన్ సినిమాలను మన వాళ్లు కాపీ కొట్టేవారు. అప్పట్లో చిరంజీవి, రజినీకాంత్, ఎన్టీరామారావు, ఏఎన్నార్ బిగ్ బీ సినిమాలను రీమేక్ చేసేవాళ్లు. అలా చేయడం వల్లే ఇక్కడ హిట్లు కొట్టి స్టార్ హీరోలు అయ్యారు. బిగ్ బీ వల్లే మన వాళ్లు ఇక్కడ అభిమానులకు దేవుళ్లు అయ్యారు. కానీ



1990లో అమితాబ్ కొంత బ్రేక్ తీసుకోవడం వల్ల మనవాళ్లు అదే మాస్ సినిమాలు తీస్తూ వచ్చారు. చాలా వరకు బిగ్ బీ వల్లే మన సౌత్ లో సినిమా ఇండస్ట్రీకి ఆదరణ పెరిగింది. కానీ ఆ విషయాన్ని ఎవరూ ఒప్పుకోరు. ఇప్పుడు బాలీవుడ్ చాలా పడిపోయింది. మన సినిమాలు అక్కడ రీమేక్ అవుతూ మంచి హిట్ కొడుతున్నాయి. పరిస్థితి ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక్కోసారి ఒక్కో ఇండస్ట్రీ టైమ్ నడుస్తుందని వ్యాఖ్యానించాడు. జంజీర్ మొదలు ముఖద్దర్ కా సికిందర్ వరకు అనేక సినిమాలు తెలుగులో రీమేక్ చేశారు.

# 'మిత్ర మండలి' ఫస్ట్‌లుక్ రిలీజ్

## ప్రియదర్శి, నిహారిక కాంబోలో కొత్త మూవీ..

**టాకీస్:** టాలీవుడ్ నటుడు ప్రియదర్శి మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా ఒక కొత్త ఎంటర్‌టైనర్‌ను నిర్మించబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మిత్రమండలి అంటూ ఈ సినిమాను తెరకెక్కించబోతుండగా.. బన్నీ వాసు ఈ సినిమాను సమర్పిస్తున్నారు. సప్త అశ్వ మీడియా వర్క్స్ మరియు వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నిహారిక కథానాయికగా నటించబోతుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించబోతున్నాడు. ఈ సినిమా బ్యాండ్ ట్రూప్ నేపథ్యంలో రాబోతున్నట్లు తెలుస్తుంది.



# బాహుబలి రీరిలీజ్..

**టాకీస్:** ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ టాలీవుడ్ చాలా ఎక్కువైంది. పాత సినిమాలని ప్రత్యేక సందర్భాలలో రిలీజ్ చేస్తూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు తెలుగు సినిమాను ప్రపంచ వ్యాప్తి చేసిన బాహుబలి సినిమాని కూడా రీరిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మధ్య మహేష్ బాబు ఖలేజా రీరిలీజ్ చేయగా, ఈ మూవీకి భారీ స్పందన వచ్చింది. ఆ సినిమా సుమారు రూ.10 కోట్ల కలెక్షన్లను అందుకొని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పటికీ ఖలేజా థియేటర్లలో ఆడుతుంది.అంతక ముందు ప్రభాస్ వర్షం సినిమా రాగా, దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది.

ఈ క్రమంలోనే బాహుబలి సినిమాను కూడా రీరిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన బాహుబలి ఫ్రాంచైజ్ రెండు భాగాలుగా విడుదలై, ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబట్టింది. ఈ సినిమాల క్రేజ్ ఇప్పటికీ ఏ మాత్రం తగ్గలేదు.బాహుబలి సినిమాల రీరిలీజ్ చేస్తే బాగుంటుందని పలు సందర్భాలలో ఫ్యాన్స్ తమ అభిప్రాయాలు చెప్పుకొచ్చారు. బాహుబలి సినిమాలను అక్టోబర్ 2025లో థియేటర్లలో రీ రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.అయితే ఫ్యాన్స్ కోసం టీమ్ ఓ ప్లాన్ వేసింది.

బాహుబలి రెండు భాగాలను కలిపి ట్రిమ్డ్ వెర్షన్‌గా ప్రేక్షకుల ముందుకు తెచ్చే ఆలోచన చేస్తున్నారట. ఈ నిర్ణయం సినిమాను కొత్తగా అనుభవించాలనుకునే ప్రేక్షకులకు మరింత వినోదం అందిస్తుంది. బాహుబలి రెండు పార్టుల్లోని అనవసర సీన్స్ ను తీసేసి, బాగా ఇంట్రెస్టింగ్ ఎపిసోడ్స్ ను మాత్రమే ఉంచి ఓ భాగంగానే రిలీజ్ చేయాలని చూస్తున్నారట. ఇప్పటికే ఎడిటింగ్ వర్క్స్ ను కూడా మొదలుపెట్టారని అంటున్నారు. ఈ వార్తలు నిజమైతే బాహుబలిని ఒకే కథగా ప్రేక్షకులకి ముందుకు వచ్చి రీరిలీజుల్లో కూడా ట్రెండ్ సృష్టించడం ఖాయం అంటున్నారు. బాహుబలి సినిమా తరువాత టాలీవుడ్ పేరు మారు మోగిపోయిన విషయం తెలిసిందే. ఈ మూవీ తరువాత ఎన్ని పాన్ ఇండియా సినిమాలు వచ్చినా.. బాహుబలి పేరు మాత్రం చరిత్రలో అలా నిలిచిపోతుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.